# మాగంటికే మా ఓటు

- భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం
- మాగంటి గోపీనాథ్‌కు మద్దతు తెలిపిన గంగపుత్ర సంఘం సభ్యులు



షేక్‌పేట్ డివిజన్‌లో గంగపుత్ర సంఘం భవనంలో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

షేక్‌పేట్ నవంబర్ 21: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం షేక్‌పేట్ డివిజన్‌లో గంగపుత్ర సంఘం భవనంలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో సంఘం సభ్యులు మాగంటి గోపీనాథ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఎమ్మెల్యేగా నిరంతరం శ్రమించామని పేర్కొన్నారు. మరో సారి అవకాశం ఇవ్వాలని ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదయ్య, కార్యదర్శి నాగరాజు, మత్స్య కార సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు దుర్గం ప్రదీప్ కుమార్ ,ప్రధాన కార్యదర్శి షకీల్ అహ్మద్, నాయకులు సయ్యద్ సజ్జాద్, రాజు, వేణు, రాజ్‌కుమార్,లక్ష్మణ్,శ్రీనివాస్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### బస్తీలో గడప గడపకు ప్రచారం...

ఎర్రగడ్డ, నవంబర్ 21: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించటమే ధ్యేయంగా గులాబీ శ్రేణులు ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారం ముమ్మరం చేశారు. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని పలు బస్తీలు, కాలనీల్లో మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని గడప గడపకు వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. పదేండ్ల క్రితం బస్తీల పరిస్థితి ఎట్లా ఉండే.. ఇప్పుడు ఎట్లా ఉంది అనే విషయాన్ని జరిగిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాగంటి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లను ఆదర్శవంతంగా తీర్చిదిద్దారని నేతలు పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రచారానికి విశేష స్పందన లభించింది. రాజ్‌నగర్, వీకర్‌సెక్షన్, అన్నానగర్, బంజారానగర్, స్వరాజ్‌నగర్, భారత్‌నగర్, ఎస్పార్టీ నగర్, సైట్–1,2,3,4,5 కాలనీల్లో మైనార్టీలు సైతం మా ఓటు కారు గుర్తుకే అంటూ కేసీఆర్‌కు జై కొట్టారు. రాజ్‌నగర్‌లో బోరబండ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, సుధాకర్ రెడ్డి, శంకర్, అంజనేయులు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సువర్ణ, రాజు, దశమంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్, ధర్మన్న, వెంకటస్వామి ప్రచారంలో పాల్గొన్నారు. వీకర్‌సెక్షన్ బస్తీల్లో సీనియర్ నేత విజయకుమార్, యూసుఫ్, ధర్మ, బాబానాయక్, దేవమణి, సరళ, తిరుపతమ్మ, రేఖ, చంద్రకళ, సైదాబీ, వసంతరావు, లక్ష్మి, సత్యనారాయణ ప్రచారం నిర్వహించారు.



రాజ్‌నగర్ బస్తీల్లో ప్రచారంలో పాల్గొన్న కృష్ణమోహన్, బీఆర్ఎస్ శ్రేణులు





వీకర్‌సెక్షన్ బస్తీల్లో ప్రచారంలో పాల్గొన్న విజయకుమార్, తదితరులు

## ఢిల్లీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు



బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, నవంబర్ 21 : ఢిల్లీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి సనత్‌నగర్ డివిజన్‌లోని 60 ఫీట్ రోడ్డు బతుకమ్మ చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వడ్డె కరుణాకర్‌రెడ్డి, దాడి పరవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివిధ పక్షాలకు చెందిన దాదాపు 300 మంది యువకులు మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫలహారం బండి మధు ముదిరాజ్, టీఎన్ఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు రాయికోడ్ శివకుమార్, నాయిని రవిరాజ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న యువకులకు మంత్రి తలసాని పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తరువాతే సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడ్డాయని, అంతకు ముందుకు సీఎం, కేంద్ర మంత్రి స్థాయి ప్రతినిధులు ఇక్కడ పని చేసిన వారు ఏనాడూ అభివృద్ధికి ప్రాముఖ్యతనివ్వలేదన్నారు. ఢిల్లీ నుంచి వస్తున్న నాయకులు తమ కల్లబొల్లి మాటలతో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తారని అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన

జూబ్లీహిల్స్,నవంబర్21: చెత్త సేకరణకు ప్రతిరోజు.. ప్రతి ఇంటికి వెళ్లే స్వచ్ఛ ఆటోలతో జీహెచ్ఎంసీ అధికారులు ఓటు ప్రాధాన్యతపై ప్రచారం నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఇప్పటికే ప్రతిఇంటి గోడలపై స్టిక్కర్‌లతో ప్రచారం చేపట్టిన అధికారులు ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా యూసుఫ్‌గూడ సర్కిల్‌లో స్వచ్ఛ ఆటోలపై ఫ్లెక్సీలు, మైకులతో ప్రచారం నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి ఆధ్వర్యంలో.. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఎస్లావత్ నేతృత్వంలో ఏఎంఓహెచ్ డాక్టర్ కె.ఎస్.రవి ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో స్వచ్ఛ ఆటోల సిబ్బంది ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి ఆటోపై ఓటు ప్రాధాన్యతను వివరించే ఫ్లెక్సీలు ఏర్పాటుచేశామని ఏఎంఓహెచ్ డాక్టర్ రవి తెలిపారు. క్షేత్రస్థాయిలో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ.. ఆటోలతో చేపడుతున్న ప్రచారాన్ని పరిశీలిస్తారని తెలిపారు.

## పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి



బ్యాలెట్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

జూబ్లీహిల్స్,నవంబర్21: పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల్లో సంబంధిత ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. రెండు రోజులపాటు పోలీసు విభాగానికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం బంజారాహిల్స్‌లో ఉన్న షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌లో 134 ఓట్లు



పోస్టల్ పోలింగ్‌లో పాల్గొన్న పోలీస్ శాఖ సిబ్బంది

జూబ్లీహిల్స్,నవంబర్21: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 134 ఓట్లు పోలయ్యాయి. బంజారాహిల్స్‌లో ఉన్న షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీస్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో పాటు ఎన్నికల సంఘం తొలిసారి ప్రవేశపెట్టిన హోమ్ ఓటింగ్‌లో 24 ఓట్లు పోలయ్యాయి. సీనియర్ సిటిజన్స్, పర్సన్ విత్ డిజేబుల్డ్ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల అధికారులు ఓటర్ల ఇంటికి వెళ్లి పోలింగ్ చేపట్టారు. జూబ్లీహిల్స్ రిటర్నింగ్ ఆఫీసర్ రవి పర్యవేక్షణలో చేపట్టిన ఈ పోస్టల్ ఓటింగ్, హోమ్ ఓటింగ్‌ను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సేవా ఎస్లావత్, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ పర్యవేక్షించారు. ఈ పోలీస్ విభాగం ఓటర్ల కోసం ఏర్పాటుచేసిన పోస్టల్ ఓటింగ్ కేంద్రాలు నేడు కూడా కొనసాగనున్నాయి.

## కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి

బేగంపేట్ నవంబర్ 21: 60 ఏండ్లుగా పాలించిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బేగంపేట్ దుస్థితిని మార్చలేకపోయారని కేవలం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహాయ సహకారాలతో చరిత్రలో నిలిచిపోయే పనులు చేసి చూపించామని కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం బేగంపేట్ డివిజన్‌లో ప్రజా ఆశీర్వాద ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. దారి పొడవునా పార్టీ కార్యకర్తలు, అభిమానులు పూల మాలలు, గజ మాలలతో ఆయనకు స్వాగతం పలికారు. పెద్ద ఎత్తున అభిమానులు, పార్టీ కార్యకర్తలు తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ...బేగంపేట్ పల్లపు ప్రాంతంలో ఉండటం వలన వర్షాలు వచ్చినప్పుడు వరద నీరు ఇక్కడ చేరుకొని అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను గుర్తించి ఆ సమస్యలను 60 శాతం తగ్గించామని తెలిపారు. ఇందుకు అనుగుణంగా మంత్రి కేటీఆర్ పక్కా ప్రణాళికతో భూగర్భ పైపులైన్, నాలాల విస్తరణ లాంటి పనులు చేపట్టారని అన్నారు. ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటిక కోసం ఇబ్బందులు పడుతున్న స్థానికులకు అధునాతన హంగులతో శ్మశాన వాటికి నిర్మించామని అన్నారు. ప్రతి గల్లిగల్లీకి సీసీ రోడ్డు, అన్ని కులాల వారికి మతాల వారికి వారి వారి సాంప్రదాయాలకు తగ్గట్టుగా ప్రోత్సహాకాలు అందించే ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.